# అమ్మాయి - ఐ ఫోను

విజయరాఘవరావు దశిక, **Livingston, NJ**

బహుశా 20 ఏళ్ళక్రితం అనుకుంటాను, సెల్ ఫోన్లు వచ్చినప్పుడు, ఏదో తమాషాగా వుంది కదా అని ఒకటి కొనుక్కున్నాను. దాన్ని ఎప్పుడోకాని వాడేవాడినికాదు. ఎప్పుడైనా ఏదో అత్యవసరమైన సందర్భం వస్తే తప్ప. రానురాను చాలా విషయాలలో సెల్ ఫోను మీద ఆధారపడటం నాకు తెలియకుండానే మొదలైంది. ఉదాహరణకు, ఇంతకు ముందు నాకు బాగా దగ్గరైన బంధువులు, స్నేహితుల ఫోను నెంబర్లు బట్టీ పెట్టేవాణ్ణి. సెల్ ఫోనులో అందరి నెంబర్లు వాళ్ళ పేర్లతోసహా ఎక్కించటంతో నెంబర్లు గుర్తుపెట్టుకోవటం మానేశాను. ఎవరినైనా పిలవాలంటే వారి పేరుని స్క్రీన్ మీదకి తెప్పించటం, సెండ్ బటన్‌ని నొక్కటం, అంతే. సంవత్సరాలు గడిచినకొద్దీ ఈ సెల్ ఫోన్లలో ఉన్న వసతులు ఎక్కువ అవటంతో ఇవి లేకుండా ఇన్నేళ్ళూ ఎలా గడిపానా అని అనిపించటం మొదలుపెట్టింది. కాని, తరువాతి తరం వాళ్ళతో పోల్చుకుంటే, నాకూ ఈ సెల్ ఫోన్‌కి ఉన్న సంబంధం చాలా సాధారణమైన విషయమని ఒకటి రెండు ఏళ్ళుగా నాకు బోధపడుతోంది. ఎందుకంటే. .

ఈ మధ్య వాషింగ్‌టన్ లో ఉన్న మా అమ్మాయి ఫోన్ చేసింది. " నాన్నా, త్రీడే వీకెండుకి రేపు ఇంటికి వస్తాను, పదింటికి ట్రైన్‌కి పికప్ చేసుకోగలవా?"అని. తను చెప్పిందంతా తెలుగులో వ్రాస్తున్నాను కాని, తను మాత్రం అంతా ఇంగ్లీషులోనే దంచేసింది. ఫోన్లగురించి మాట్లాడుతూ ఇప్పుడు ఈ ఇంగ్లీష్ గురించి ఎందుకులెండి. ఇది మరో టాపిక్‌గా ఇంకోసారి మాట్లాడుకుందాం.

అలాగే మర్నాడు ప్రొద్దున్న, ట్రైన్ స్టేషన్‌కి వెళ్ళి మా అమ్మాయిని కార్లో ఎక్కించుకున్నాను. "హలో నాన్నా, ఎలా వున్నావ్" అని ఒకసారి కౌగలించుకొని, కారులోకి ఎక్కింది.

నా పక్కనే ప్యాసింజర్ సీట్లో కూర్చుంది. నేను కారుని నడపటం మొదలుపెట్టాను. "వాషింగ్టన్ లో అంతా బాగుందా?" అని సంభాషణ మొదలుపెట్టాను. వెంటనే సమాధానం రాలేదు.

కొద్దిగా తల తనవంక తిప్పి చూశాను. చేతిలో ఐ ఫోను. చూపుడువేలుతో బటన్స్ నొక్కేస్తోంది. నేను తనవంక చూడటం కనిపెట్టి పరాకుగా "వాట్ డాడీ?" అంది. "ఆ ఏంలేదు" అని డ్రైవింగు మీద్ద దృష్టి మరల్చాను.

మా అమ్మాయి అప్పుడప్పుడు ఫోన్ బటన్స్ నొక్కడంఆపి, " ఓ షూట్" అనీ, "ఓహ్ మై గాడ్" అనీ అనటం, మధ్య మధ్య కిసుక్కున నవ్వటం వినిపిస్తున్నాయి.

అంతలోనే ఫోన్ రింగయింది. "హలో, హాయ్ డేవిడ్, హౌ ఆర్ యు?. . . . నో. నో ఐ యామ్ నాట్ ఇన్ మై ఆఫీస్. . . యా ఐ యామ్ అవుట్ ఆఫ్ టౌన్ . . నోనో, డోన్ట్ వర్రీ. . యు డోన్ట్ హావ్ టు వెయిట్ అంటిల్ ఐ గెట్ బ్యాక్. ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ ఇట్ రైట్ నౌ. ఐ విల్ ఈమైల్ ది కొటేషన్ టు దెమ్ రైటవే. . . . ఓకె సీ యు ఇన్ త్రీ డేస్" అని ఎండ్ బటన్ నొక్కింది. వెంటనే గబగబా మళ్ళీ బటన్స్ నొక్కడం, కాసేపట్లో "జూమ్" అని ఈ మెయిల్ పంపినట్టు శబ్దం రావడం వినిపించాయి.

మాఇంటికి స్టేషన్ నుంచి అరగంట పడుతుంది. అప్పుడే సగం దూరం వచ్చేశాం. కానీ, మా అమ్మాయితో సంభాషణ ఏమీ జరగటం లేదు. నాకు కాస్త విసుగొచ్చి, కొద్దిగా గొంతు సవరించుకున్నట్టుగా శబ్దాలు, ఇంకా తరువాత లేని దగ్గుని తెచ్చిపెట్టుకుని దగ్గటం చేశాను. ఆ శబ్దాలు విని "డాడ్, ఆర్ యు ఓకె?' అని అడిగింది.

ఆ అడిగిన తీరు "అబ్బా, ఏమిటి డాడీ, నేను ఫోను మీద వుంటే ఈ క్షోభ" అని అన్నట్లే అనిపించింది గాని, సానుభూతిగా అన్నట్లు అనిపించలేదు.

"ఐ యామ్ ఓకె" క్లుప్తంగా అని నోరు మూసుకున్నాను. ఇంతలో వర్షం మొదలైంది. మా అమ్మాయి గబుక్కున తల ఎత్తి " ఇక్కడ వెదర్ ఫోర్ కాస్టు ఏమిటి?" అని అడిగింది. కానీ, నా సమాధానానికి ఆగలేదు. గబుక్కున,"లెట్ మి చెక్ ది వెదర్" అని ఫోన్ మీద ఉన్న వెదర్.కాం బొమ్మని నొక్కేసింది. "బాబోయ్, ఇవాళా రేపూ వర్షమే. అయితే మనం ఇంట్లో కూర్చోవడమే" అని అంది.

"ఇంట్లో ఎందుకు కూర్చుంటారమ్మా! నువ్వూ, మీ అమ్మా మాల్స్ చుట్టూ తిరగరూ?" గొణుక్కున్నాను.

సరే , ఎలాగో ఇంటికి వచ్చి పడ్డాం. కారు డ్రైవ్ వే లోకి రాగానే ఇంటి తలుపు తెరుచుకుని మా అబ్బాయి వచ్చాడు. వాడు ఓ గంట దూరంలో వుంటాడు. "నువ్వు ఎప్పుడు వచ్చావురా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అక్క నాకు టెక్స్ట్ ఇచ్చింది, తను వస్తున్నట్టు" చెప్పాడు. "గుడ్, ఫ్యామిలీ అంతా కలిసి వీకెండ్ గడపచ్చు" ఆశగా అనుకున్నాను.

మా అమ్మాయి ఇంట్లోకి రాగానే డైనింగ్ టేబుల్ మీద సగం వైపు అంతా తన కంప్యూటర్ సరంజామా పరిచేసింది. మిగతా సగాన్ని మా అబ్బాయి ఆక్రమించుకున్నాడు. మళ్ళీ మొదలు! టక్, టక్ మంటూ కీ బోర్డ్ చప్పుళ్ళు.

లంచ్ అవగానే మాల్‌కి వెళ్ళాలని అందరం కారులో బయలుదేరాం. మా పిల్లలిద్దరూ వెనక సీట్లో కూర్చున్నారు. మాటామంతీలేదు. రేర్ వ్యూ అద్దాన్ని సద్ది వాళ్ళని చూశాను.

ఏముందీ, చూపుడు వేళ్ళతో ఫాస్టుగా ఐ ఫోన్లని నొక్కేస్తున్నారు ఇద్దరూ!

సడన్‌గా మా అమ్మాయి, "ఒరేయ్, యు క్రాక్ మి అప్" అని అంది.

నాకేమీ అర్థం కాలేదు. 'వాడేమీ మాట్లాడలేదే? ఈ పిల్ల ఏమంటోంది?' అనుకుని, "ఏమిటమ్మా, అంటున్నావు?" అన్నాను. వెంటనే, మా శ్రీమతి అంది "నీకేమీ తెలియదు. వాళ్ళు మనం వినకుండా టెక్స్టు మెసేజ్‌లతో మాట్లాడుకుంటున్నారు".